# దోపిడీ వ్యవస్థ

"ఈ సమాజంలో స్త్రీ ఒక బానిస. ఆమెను దారుణంగా దగాచేసి దోచుకుంటోంది వ్యవస్థ. ఈ బూర్జువా వ్యవస్థలో స్త్రీ అడుగడుగునా దోచుకోబడుతోంది."

ఆ అమ్మాయి గుక్క తిప్పుకోవడం కోసం అన్నట్టు ఆగింది. నేను ఆశ్చర్యంగా ఆమెనే చూస్తున్నాను. ఈ కుర్రదానికి నిండా పది హేడేళ్ళు వుండవు. కడుపు పట్టనన్ని భావాలతో, ఉద్రేకాలతో వూగి పోతోంది.

"ఏమండీ చెప్పరేం? నే నన్నమాట అబద్ధమా? స్త్రీని ఒక విలాస వస్తువుగా వాడుకుని, బానిసగాచేసి, ఈనాటి సమాజం స్త్రీ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను దోచుకోవడం లేదూ" అంది మరింత ఆవేశంగా. నేను నవ్వాను.

"అంతంత పెద్ద విషయాలు నీ కిప్పు డెందుకులే. అవన్నీ తెలుసు కోవడానికి ఇంకా చాలా టైము వుంది" అన్నాను.

"అలా అనకండి. మనమే స్థితిలో వున్నామో, మనకేం కావాలో, మన బ్రతుకు లేమిటో తెలుసుకోకుండా, ఆలోచించకుండా వుండడం నా కిష్టంలేదు."

"మంచిది. ఏం చేస్తావు మరైతే?" అన్నాను. "ఏం చేసే దేముంది? స్త్రీ తన స్వాతంత్ర్యం ఎప్పుడూ కాపాడుకోవాలి. పురుషుడి అధికారానికి, ఆధిక్యానికి లొంగిపోయి, అణిగి మణిగి వుండి తన ఉనికినే నిరర్థకం చేసుకోకూడదు" అంది.

నా గుండె జల్లుమంది. రోజూ నా ప్రాణం తీసి, ఎక్కడెక్కడి పుస్తకాలు తీసుకెళ్ళి ఈ ముక్కు పచ్చలారని పిల్ల ఏం చేయబోతోందో అని బెంగ కలిగింది.

అంతటితో ఆ విషయం మార్చేద్దామని "ఇంతకీ పరీక్ష లెలా వ్రాసావు?" అన్నాను.

"బాగా వ్రాసానండీ" అంది. టేబిల్ మీద పుస్తకంతీసి తిరగేస్తూ.

"చదువుతావా అది" అన్నాను కుతూహలంగా. నిజానికి నాకు తెలుసు, అది ఆ అమ్మాయి చదివే పుస్తకంకాదని. ఆమెకి నచ్చే సాహిత్యం అది కాదని. అందుకే ప్రాణప్రదమైన ఆ పుస్తకాన్ని ఇచ్చేసేటట్టు అన్నాను.

పుస్తకం అటూ ఇటూ తిప్పి "వద్దండీ, మరీ ఇంత ఓల్డు బుక్స్ నేను చదవలేను. ముఖ్యంగా అట్ట ఇంత పాతగా, గోధుమరంగు వచ్చేసి వుంటే నాకు పరమబోర్" అంది ఆ విజ్ఞానదాహి.

దాహి పరీక్షపోయింది. ఒక రోజంతా ఏడ్చింది. వాళ్ళమ్మ కేక లేసింది. పరీక్ష పోయినందుకు కాదు. కళ్ళు వాచిపోయేలా ఏడ్చినందుకు. ఆ ఒక్కరోజే బాధంతా. మళ్ళీ మర్నాటి నుంచి మామూలే.

కాలేజీ కెళ్ళాల్సిన అవసరం కూడా లేకపోయింది. ఇంక పరీక్షకి మళ్ళీకట్టే వుద్దేశం వుందో లేదో తెలీదుగాని, సమయం దొరికినప్పుడల్లా ఏదో పుస్తకం చదవడం, అటూ ఇటూ పెత్తనాలు.

వాళ్ళది ఏమంత శ్రీమంతుల కుటుంబం కాదు. తండ్రి ఒక కొట్లో గుమాస్తా. అన్నయ్యకి మొన్ననే గవర్నమెంటు ఉద్యోగం వచ్చింది. ఎప్పుడీ కుటుంబాన్నే వదుల్చుకుందామా అని చూస్తూ వున్నాడు. ఆ పిల్ల చదువు అంతటితో ఆగిపోయింది. తర్వాత ఇంకా ముగ్గురు. చిన్నా చితుకు. తల్లి బండెడు చాకిరీతో సతమతమైపోతూ వుంటుంది. కూతురు గురించి పట్టించుకునే తీరికా లేదు. అంతటి విజ్ఞానమూ లేదు.

ఆ అమ్మాయి అప్పుడప్పుడు నా దగ్గరికి వచ్చి ఫ్యూడల్ వ్యవస్థ, బూర్జువావర్గం అంటూ ఏదేదో మాట్లాడుతూనే ఉండేది.

o o o

ఒకరోజు తెల్లవారేసరికి వీధిలో పెద్ద గొడవ. ఏడుపులు పెడ బొబ్బలు. అరుపులు. తీరా చూస్తే దాహి పక్కనుండే ఒక అబ్బాయిని ఎవరికీ చెప్పా పెట్టాకుండా రాత్రికి రాత్రి పెళ్ళాడేసింది. ఆ పిల్ల తల్లి తండ్రులు ఒకటే గోల. ఆ పెళ్ళికొడుకు వీరి కులం కాదుట. పైగా వివాహితుడు. చేసుకున్న భార్య నచ్చక వదిలేశాడు. ముప్ఫై ఏళ్ళకి పైనే వుంటాయి. పెద్దగా చదువలేదు. ఏదో ప్రయివేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. రెండు వందలికి మించిరాదు.

ఇదెలా జరిగిందా అని నేను ఆశ్చర్యంలోంచి తేరుకోడానికి చాలా సమయం పట్టింది.

అప్పటికప్పుడు ఆ తల్లిదండ్రులు ఇల్లు ఖాళీచేసి వేరే చోటికి పరారయిపోయారు. ఆ అమ్మాయి భర్తతో అక్కడే దిగబడిపోయింది.

o o o

రోజూ రెండు పూటలా జడ వేసుకోవడం, ట్రిమ్‌గా తయారవడం, భర్త రాకకై ఎదురు చూడడం, తెల్లారి ఏడైనా నిద్ర లేవకపోవడం, మధ్యాహ్నం వేళలలో మెట్లమీద కూర్చుని ఆలోచించడం - ఇది ఆమె దినచర్య.

స్త్రీ స్వాతంత్ర్య రక్షణ ఏమైంది? బానిసగా స్త్రీ బ్రతకకూడదనే పట్టుదల ఏమైంది? చదువేమైంది? ఆర్థిక స్వాతంత్ర్యం ఏమైంది? అన్నింటికీ మించి ఈ వివాహ వ్యవస్థమీద అసహ్యం ఎక్కడికి పోయింది?

ఆ అమ్మాయిని చూస్తుంటే జాలేస్తుంది. చిన్న వయసు. నా అన్నవాళ్ళు, కన్నవాళ్ళు ఎవ్వరూ కనిపించరు. అందరికీ ఆమె శత్రువు. మాట్లాడరు. కనీసం ముఖం చూడరు.

నీ ఆశయాలు ఎటువంటివైనా వాటిని సంరక్షించుకోడానికి నీకు క్రమశిక్షణ చాలా అవసరం అని చెప్పాలనిపిస్తుంది.

చదువుకోవాల్సిన సమయంలో కాలం వృధా చేసింది. మనసుని పక్కదారులు పట్టించి చెడగొట్టుకుంది.

ఎరువు తెచ్చుకున్న భావాలతో, ఎరువు పుచ్చుకున్న జీవితంకోసం అర్రులు చాచింది.

స్త్రీగా చదువులేదు. ఆర్థిక స్వాతంత్ర్యంలేదు. మరో విధంగా జీవనోపాధి చూచుకోగల శక్తిలేదు. భర్త ఇన్ని మెతుకులు పడేస్తే అతనికి పిల్లల్ని కనిపెట్టడంకంటె చేయగలిగిందేమీ లేదు.

దీని కెవరు బాధ్యులు? తల్లిదండ్రులా? పరిసరాలా? పుస్తకాలా?

పర్యవసానం అనుభవించేది మాత్రం నువ్వే-నువ్వే అనక తప్పదు.

ఇది దోపిడీ వ్యవస్థ అని ఘోషించిన ఆ పసి హృదయానికి తెలీదు. ఇది పరస్పరం స్త్రీ పురుషుల మధ్య వుండే "వలపు దోపిడీ వ్యవస్థ" అని.

●